క్లుప్తంగా

నేడు ప్రారంభోత్సవాలు ఫుల్

గంగవరం: మండలంలో రూ. 2.71కోట్లతో పూర్తయిన పలు అభివృద్ధి పనులను గురువారం పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కల్లుపల్లె, కలగటూరు, మేలుమాయి, గంగవరం-3 డ్రైవర్స్ కాలనీ, మారేడుపల్లెలో, దండపల్లె, జీడిమాకులపల్లెలో ఆయన పర్యటించి ప్రారంభోత్సవాలు చేస్తారని తెలియజేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: మండలంలోని శ్రీ శక్తి భవనంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి కుటుంబంలో మహిళ ఆదర్శంగా ఉంటే ఆ కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు విద్యావంతులుగా ఉంటే పిల్లలు భవితకు చక్కగా బాటలు వేయగలరన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సత్తా చాటి, సమాజం, దేశాభివృద్ధిలో కూడా తమదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు పసుపు-కుంకుమ ఇచ్చి సన్మానించారు.

8న జెడ్పీ అతిథి గృహం ప్రారంభం



జెడ్పీ గెస్ట్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఈడీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ

పుంగనూరు: ఈనెల 8న నూతన జెడ్పీ అతిథి గృహాన్ని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని మైనారిటీ కార్పొరేషన్ ఈడీ, డిప్యూటీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఏఎంసీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డితో కలిసి గెస్ట్ హౌస్ భవనాలను పరిశీలించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రూ.2 కోట్లతో గెస్ట్‌హౌస్‌ను నిర్మించినట్టు చెప్పారు.

గుడికి నీటి పైపుల వితరణ



పైపుల వితరణ చేస్తున్న విజయ భాస్కరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని106 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీలో గుట్టమీద ఉన్న శివాలయానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.విజయభాస్కరరెడ్డి రూ.30వేల విలువచేసే తాగునీటి పైపులను ఉచితంగా అందజేశారు. గుడి గుట్ట పైన ఉండడంతో ఈ పైపులను తాగునీటి సరఫరా కోసం ఇచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జంపాల రాజేష్, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై పరిశీలన



చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న సీ మ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

చౌడేపల్లె: పది పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ఎస్‌ఎస్‌సీ సీ మ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య బుధవారం పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 18 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మస్తానయ్య ఈ కేంద్రాన్ని సందర్శించారు. నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాల రూముల్లో విద్యుత్‌దీపాలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, కొన్ని భవనాలకు కిటికీలు, డోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, సుధాకర్, సీఆర్పీ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

రొంపిచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రిసోర్స్ పర్సన్ సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో సంఘమిత్రలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, సంఘమిత్రలు మానస, గీత పాల్గొన్నారు.

మల్లప్ప కొండకు ప్రత్యేక బస్సులు

కుప్పం: మహా శివరాత్రి పండుగ సందర్భంగా గుడుపల్లె మండలం మల్లప్ప కొండకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. ఈ ఉత్సవాలకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రజలు అధికంగా తరలివస్తారని, భక్తుల సౌకర్యార్థం కుప్పం డిపో నుంచి శుక్రవారం 20 ఆర్టీసీ బస్సులను మల్లప్ప కొండకు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు, భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వంద పడకల ఆస్పత్రి కల సాకారం

- నేడు ఆస్పత్రిని ప్రారంభించనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- నాడు-నేడుతో రూపురేఖలు మారిన ఏరియా ఆస్పత్రి
- అభివృద్ధి పనులతో కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తున్న వైనం



నాడు-నేడు ద్వారా నిర్మించిన పలమనేరు వంద పడకల ఆస్పత్రి

పలమనేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడే రోగులు..వైద్యుల కొరత.. అందుబాటులోని మందులు..తగినన్ని బెడ్లు లేక వరండాలో రోగులు.. చిన్నపాటి వైద్యం అందక పెద్దాసుపత్రులకు రెఫర్ చేసే పరిస్థితి గత ప్రభుత్వ పాలనలో పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చూశాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి సైతం పెద్దపీట వేసింది. నాడు-నేడు పథకం కింద రూ.16కోట్లతో ఇక్కడి 50 పడకల ఆస్పత్రిని వంద పడకల కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దింది. మెరుగైన వైద్యసేవలకు రా..రమ్మని పిలుస్తోంది.

రూ.16 కోట్లతో నిర్మాణం

ఏరియా ఆస్పత్రిని టీడీపీ ప్రభుత్వం తమ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 50 బెడ్లతో ఆస్పత్రిని నిర్మించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎప్పటిలాగే వైద్యరంగం అభివృద్ధికి మొండిచెయ్యి చూపారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చి, నాడు-నేడు ద్వారా నాబార్డ్ 25 ట్రాంచ్ నిధులు రూ.16 కోట్లను 2020లో మంజూరు చేసింది. ఈ పనులను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ పనులు చేసింది.

కొత్త హంగులతో సిద్ధమైన ఏరియా ఆస్పత్రి

ఇప్పటికే ఆస్పత్రిలోని ఐదు బ్లాకులతో పాటు అదనంగా మరో ఐదు బ్లాకులు కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. ప్రసూతి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ,బర్న్స్ యూనిట్, ఐసోలేషన్ వార్డ్, 21 బెడ్లతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ప్రత్యేకంగా 21 బెడ్లతో లేబర్ బ్లాక్, ఓటీ కాంప్లెక్స్, రేడియాలజీ, ల్యాబ్స్, ఆర్థో, జీఎస్ అండ్ జీఎం, ఐ అండ్ ఈఎన్‌టీ పది బెడ్లు, పే రూమ్స్, బ్లడ్ బ్యాంకు, క్యాంటీన్, బయోమెడికల్ వేస్ట్, అటెండర్స్ రెస్ట్ రూమ్స్, నూతన మార్చురీ..మొదలైన వాటిని ఏర్పాటు చేశారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించారు. ఇది 50 మందికి ఆక్సిజన్ అందజేస్తుంది.

ఇకపై వంద పడకలతో రోగులకు సేవలు

వంద పడకల ఆస్పత్రిగా పేరున్నప్పటికీ ఇక్కడ ఇన్‌పేషెంట్లకు 50 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్త భవనాల నిర్మాణంతో వందబెడ్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో రోజూ ఓపీ సగటు 500కు పైగా ఉంది. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు సగటు 70గా ఉంది. నెలకు సగటున 70 ఆపరేషన్లు చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మొత్తం 100మంది సేవలందిస్తున్నారు. ఇకపై ఈ సేవలన్నీ రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

కళ్లకు కట్టినట్టు అభివృద్ధి



గత ప్రభుత్వాలు ప్రభుత్వ ఆస్పత్రులను, పేదలకు వైద్యసేవలను నిర్లక్ష్యం చేశాయి. దీంతో ప్రైవేటు ఆస్పత్రులే రోగులకు దిక్కుగా మారాయి. కానీ తమ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసింది. ఏరియా ఆస్పత్రిలో గతంలో ఉన్న భవనాలు, ఇప్పుడు కట్టిన కొత్త భవనాలు, అందుతున్న సేవలే దీనికి సాక్ష్యం. పలమనేరు ఆస్పత్రిని ఎవరైనా వెళ్లి చూస్తే మా ప్రభుత్వం చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. –వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

కార్పొరేట్‌ను తలదన్నేలా ఆస్పత్రి



గత టీడీపీ హయాంలో ఉన్న ఆస్పత్రి సేవలకు ఇప్పటి వైఎస్సార్ పాలనలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సేవలను నేరుగా ఇక్కడి ఆస్పత్రికొచ్చిన రోగులను అడిగితే తెలుస్తుంది. అన్ని విభాగాలు, స్పెషలిస్టులు, అత్యాధునిక పరికరాలు, ఆక్సిజన్ యూనిట్.. ఇలా ఏరియా ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా మారింది. సీఎంకు ఈ ప్రాంత వాసుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నాం. –చెంగారెడ్డి, ఆస్పత్రి కమిటీ చైర్మన్, పలమనేరు

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలోని మరకతేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు వేదపండితులు భక్త జన సందోహం నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా కుమారస్వామిరెడ్డి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. పాటదారులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వాయిదాకు కారణమైందని చెప్పారు. తదుపరి వేలం ఎప్పుడనేది తేదీ నిర్ణయం అయ్యాక తెలియజేస్తామన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు రాజేష్, భారతి, రామదాస్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం..ఆశీర్వదించండి



ఎన్నికలకు తాము సిద్ధమని నినదిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చౌడేపల్లె: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారని, ఈ అభివృద్ధిని ప్రజలకు చాటిచెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. మేము సిద్ధం..మాఊరు సిద్ధం...మా బూత్ సిద్ధం పేరిట బుధవారం మండలంలోని పరికిదొన, గడ్డంవారిపల్లె, కొండామర్రి, వెంగళపల్లె, దిగువపల్లె, కాగతి, కాటిపేరి, లద్దిగం, పుదిపట్ల, చింతమాకులపల్లె ,కొండయ్యగారిపల్లె, పెద్దయల్లకుంట్ల, చౌడేపల్లె పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చేసిందన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇది తెలియజేసి మరోసారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ప్రజలను కోరాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల ముందు ప్రత్యక్షమై మోసపు హామీలతో వంచించే వాళ్లకు బుద్ధి చెప్పాలని, ప్రజల కోసం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన విజయవంతం చేద్దాం





ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, మంత్రి పర్యటన, ఆస్పత్రి ప్రారంభోత్సవం ఏర్పాట్లపై పట్టణ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- పార్టీ నాయకులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలో గురువారం వంద పడకల ఆస్పత్రి ప్రారంభం, రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ, వైఎస్సార్ చేయూత బహిరంగ సభలకు ముఖ్య అతిథిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొననున్నారని, ఈ కార్యక్రమాలను నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. బుధవారం వంద పడకల ఆస్పత్రి వద్ద ఏర్పాట్లను పట్టణ నాయకులతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. తొలుత పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ నుంచి మంత్రికి స్వాగతం తెలుపుతూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. ఇది విస్మరించిన టీడీపీ నాయకులు, సోషల్ మీడియాలో డబ్బా కొట్టి టీడీపీ సానుభూతి పరులు ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వచ్చి ఎలా ఉందో చూడాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తి నాయక్, ఆర్‌ఎంఓ శారద, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, ముజ్జు, కౌన్సిలర్లు రహీంఖాన్, కోదండరామయ్య, హయాత్, కిరణ్, నాగరాజు, రాజేష్, మున్నా, హేమ, కమాల్, మొహిద్దీన్, రమేష్‌రెడ్డి, రఘునాథ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బట్టందొడ్డిలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డిలో బుధవారం పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 76 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. వేసవిలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ కుమారి, ఏఎన్‌ఎం వసంత కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి



హాజరైన రైతులు, సిబ్బంది

వి.కోట: టమాట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఒక ప్రవేటు ఫంక్షన్ హాల్‌లో వి.కోట, బైరెడ్డిపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన టమాట రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డితోపాటు ఉద్యానశాఖాధికారులు వేసవిలో టమాట పంట సాగు కోసం మొక్కల ఎంపిక, డ్రిప్ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు నీటి తడుపులు, ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. సస్యరక్షణ పద్ధతులు, పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎరువుల వాడకం విషయంలో ఉద్యానవన శాఖాధికారుల సలహాలు-సూచనలు స్వీకరించాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు భరత్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సుబ్బారెడ్డి, వి.కోట, కుప్పం ఉద్యానశాఖాధికారులు లక్ష్మీప్రసన్న, డింపు ప్రియశ్రీ, అన్ని మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దుర్గ

రామకుప్పం: మండలంలోని కోట్లగూరుకు చెందిన అశోక్ రెడ్డి అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. దీంతో ఆయన ఎమ్మెల్సీ భరత్‌ను ఆశ్రయించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్సీ చొరవతో రూ.1.50 లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును బుధవారం ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అశోక్ రెడ్డికి అందజేశారు. తనకు సాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ నారాయణస్వామి, పార్టీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.


చర్యలు తప్పవు

పలమనేరు: పట్టణంలో అనధికారికంగా చీటీలు నిర్వహించడం, ఆపై సకాలంలో డబ్బులివ్వకపోవడం, అలాగే ఫైనాన్స్ వ్యాపారస్తులు అధిక వడ్డీ వసూలు చేయడం నేరమని పలమనేరు సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని ఓ టీ కొట్టు నిర్వాహకుడు ఉదయ్‌కుమార్ కుటుంబం అదృశ్యమవడం వెనుక అధిక వడ్డీల బాధ, అనధికారిక చీటీల కారణంగానే విరక్తి చెంది వెళ్లిపోయినట్టు తేలిందన్నారు.

లారీని ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

గంగవరం: లారీని ఢీకొని మోటార్ సైక్లిస్టు గాయపడిన సంఘటన బుధవారం మండల కేంద్రంలోని హైవేపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం .. గంటావూరు వైఎస్సార్ కాలనీకి చెందిన సాహిల్(23) బైక్‌లో గంగవరం ఫ్లైఓవర్ నుంచి పలమనేరు వైపు వెళ్తూ సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా హైవేలో ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాహిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

శివరాత్రి వేడుకలకు మల్లప్పకొండ సిద్ధం



ముస్తాబైన మల్లప్పకొండ ఆలయం



మల్లప్ప కొండపైకి వచ్చే విశాలమైన రోడ్డు

గుడుపల్లె: మూడు రాష్ట్రాల కూడలిలోని మల్లప్పకొండపై ఎత్తైన శిఖరాలపై ఉన్న సప్తగిరి మల్లేశ్వరస్వామి ఆలయంలో గురు, శుక్రవారాలు మహాశివ రాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. గురువారం ఆలయం రుద్రాభిషేకం, గిరిజా కల్యాణోత్సవం, 8న మహాశివ రాత్రి పురస్కరించుకుని భక్తులకు ప్రత్యేక దర్శనం, పగలు హరికథ, రాత్రి జాగారం కోసం పౌరాణిక నాటక ప్రదర్శన, 9న మహా మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఆలయాన్ని ప్రత్యేక అలంకరణంతో ముస్తాబు చేశారు. భక్తులను దృష్టిలో ఉంచుకుని తోపులాటకు దారితీయకుండా బ్యారికేడ్లతో క్యూలు ఏర్పాటు చేశారు. కుప్పం నుంచి మల్లప్పకొండపైకి 20 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

ఆలయానికి గ్రిల్ విరాళం

కుప్పానికి చెందిన వెంకటేశ్వర వెల్డింగ్ శేఖర్ తోపాటు మునిరాజ్ లోకేష్, సురేష్ రూ.70 వేల విలువ చేసే వంద అడుగుల గ్రిల్‌ను ఆలయం ఎదుట అమర్చారు. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.